## అజ్మల్ కసబ్‌పై కాంగ్రెస్ నేత ప్రేమ

ముంబై : ముంబై 26/11 ఉగ్రదాడిపై కాంగ్రెస్‌కు చెందిన మహారాష్ట్ర ప్రతిపక్ష నేత విజయ్ నామ్‌దేవ్ వడెట్టివర్ వివాదాస్పద వ్యాఖ్యలు చేశారు. ఉగ్రదాడిలో మరణించిన మహారాష్ట్ర మాజీ యాంటీ టెర్రరిజం స్క్వాడ్(ఏటీఎస్) చీఫ్ హేమంత్ కర్కరేని చంపింది ఉగ్రవాది అజ్మల్ కసబ్ కాదని వ్యాఖ్యానించారు. కర్కరేను చంపింది ఆర్ఎస్ఎస్‌తో అనుబంధం ఉన్న ఒక పోలీసు అని ఆయన పేర్కొన్నారు. ఉగ్రదాడి కేసులో ప్రభుత్వం తరపున పబ్లిక్ ప్రాసిక్యూటర్‌గా వాదనలు వినిపించిన ఉజ్వల్ నికమ్‌ను లక్ష్యంగా చేసుకొని విజయ్ వడెట్టివర్ ఈ వ్యాఖ్యలు చేశారు. ఉజ్వల్ ప్రస్తుతం బీజేపీ తరపున ముంబై నార్త్ సెంట్రల్ లోక్‌సభ స్థానం నుంచి పోటీ చేస్తున్నారు. 'ఉజ్వల్ కోర్టులో కూడా నిజం చెప్పని ఒక ద్రోహి' అని విజయ్ ఆరోపించారు.

# కంచుకోటలు పదిలమా?

- మూడో దశ ఎన్నికల్లో రసవత్తర పోరు
- కీలక నేతలకు అగ్నిపరీక్షగా పలు స్థానాలు
- పట్టు నిలుపుకునేందుకు ఉద్ధండుల పాట్లు

న్యూఢిల్లీ, మే 5: సార్వత్రిక ఎన్నికల మూడో దశకు రంగం సిద్ధమైంది. మే 7న 92 లోక్‌సభ స్థానాలకు పోలింగ్ జరగనుంది. ఇప్పటికే ప్రచారపర్వం ముగిసింది. దేశ రాజకీయాల్లో కీలక నేతలుగా ముద్రపడ్డ వారికి ఈ ఎన్నికలు అగ్నిపరీక్షగా మారాయి. కొన్ని స్థానాల్లో ఫలితాలు సదరు నేతల భవిష్యత్తును తారుమారు చేసే పరిస్థితి ఉన్నది. దీంతో తమ కంచుకోటల్లో గెలుపు కోసం నేతలు మండుటెండల్లో చెమటోడ్చి ప్రచారం నిర్వహించారు.

**కర్ణాటకలో గుల్బర్గా, ధార్వాడ్, హవేరి**

కర్ణాటకలో మూడో దశలో 14 స్థానాలకు ఎన్నికలు జరుగుతాయి. వీటిల్లో గుల్బర్గా, ధార్వాడ్, హవేరీ కీలక స్థానాలు. ఏఐసీసీ అధ్యక్షుడు మల్లిఖార్జున ఖర్గే సొంత నియోజకవర్గం గుల్బర్గా. ఈసారి ఖర్గే పోటీ నుంచి తప్పుకొని, తన అల్లుడు రాధాకృష్ణ దొడ్డమానికి టికెట్ ఇచ్చారు. గుల్బర్గాలో విజయం కోసం ఖర్గే తీవ్రంగా ప్రయత్నిస్తున్నారు. భావోద్వేగ ప్రసంగాలు చేశారు. ఇక, కేంద్రమంత్రి ప్రహ్లాద్ జోషి నాలుగోసారి ధార్వాడ్ నుంచి పోటీ చేస్తున్నారు. జోషిపై ఈసారి కాంగ్రెస్ తరపున వినోద్ అసూటి పోటీ చేస్తున్నారు. హవేరీ స్థానం నుంచి బీజేపీ తరపున మాజీ ముఖ్యమంత్రి బసవరాజ్ బొమ్మై పోటీ చేస్తుండటంతో ఈ స్థానంపైనా అందరి ఆసక్తి నెలకొన్నది.

**మధ్యప్రదేశ్‌లో రాజ్‌గఢ్, గుణ, విదిశ**

మూడో విడతలో మధ్యప్రదేశ్‌లోని తొమ్మిది లోక్‌సభ స్థానాలకు ఎన్నిక జరగనుంది. వీటిల్లో రాజ్‌గఢ్, గుణ, విదిశ స్థానాల్లో ఎన్నికలు ఆసక్తికరంగా మారాయి. రాజ్‌గఢ్‌లో మాజీ ముఖ్యమంత్రి, కాంగ్రెస్ సీనియర్ నేత దిగ్విజయ్ సింగ్ పోటీ చేస్తున్నారు. గత ఎన్నికల్లో భోపాల్ నుంచి పోటీ చేసి ఓడిన దిగ్విజయ్ ఈసారి రాజ్‌గఢ్‌లో అదృష్టం పరీక్షించుకుంటున్నారు. గత రెండు ఎన్నికల్లో ఇక్కడ బీజేపీ అభ్యర్థి రోడ్‌మాల్ నాగర్ భారీ మెజారిటీతో విజయం సాధించి ఇప్పుడు హ్యాట్రిక్‌పై కన్నేశారు. ఇక, గుణ స్థానం బీజేపీ నేత, కేంద్ర మంత్రి జ్యోతిరాదిత్య సింధియాకు ప్రతిష్ఠాత్మకంగా మారింది. 37 ఏండ్లు, మూడు తరాల సింధియా కుటుంబసభ్యులు ఇక్కడ ఎంపీలుగా పని చేశారు. ఆయనపై కాంగ్రెస్ తరపున యదవేంద్ర సింగ్ యాదవ్ పోటీ చేస్తున్నారు. విదిశ స్థానం నుంచి మాజీ ముఖ్యమంత్రి శివరాజ్ సింగ్ చౌహాన్ బీజేపీ తరపున పోటీ చేస్తున్నారు. గతంలో ఐదుసార్లు ఆయన ఇక్కడ ఎంపీగా గెలిచారు. 20 ఏండ్ల తర్వాత ఆయన మళ్లీ విదిశ నుంచి పోటీ చేస్తున్నారు. కాంగ్రెస్ తరపున ఆయనపై ప్రతాప్ భానుశర్మ పోటీకి నిలిచారు.

**మహారాష్ట్రలో బారామతి, సతారా**

మూడో దశలో మహారాష్ట్రలోని 11 లోక్‌సభ స్థానాలకు ఎన్నికలు జరుగుతున్నాయి. ఇందులో బారామతి, సతారా కీలక స్థానాలుగా ఉన్నాయి. బారామతి ఎన్సీపీకి, సీనియర్ నేత శరద్ పవార్‌కు కంచుకోటగా ఉంది. ఇక్కడ శరద్ పవార్ ఆరుసార్లు గెలవగా, గత మూడు ఎన్నికల్లో ఆయన కూతురు సుప్రియా సూలే విజయం సాధించారు. మరోసారి ఆమె పోటీలో ఉండగా, ఎన్సీపీ(అజిత్ పవార్) నుంచి అజిత్ పవార్ సతీమణి సునేత్ర పోటీ చేస్తున్నారు. ఇక, సతారా నుంచి వరుసగా గత ఆరు ఎన్నికల్లో ఎన్సీపీ విజయం సాధించింది. ఈసారి ఎన్సీపీ(శరద్ పవార్) తరపున శశికాంత్ షిండే పోటీ చేస్తుండగా బీజేపీ తరపున ఉదయన్‌రాజే భోసలే పోటీలో ఉన్నారు.

**గుజరాత్‌లో గాంధీనగర్, పోర్‌బందర్**

గుజరాత్‌లోని మొత్తం 26 స్థానాలకు మూడో దశలోనే పోలింగ్ జరగనుంది. గుజరాత్‌లో గాంధీనగర్, పోర్‌బందర్ కీలక లోక్‌సభ స్థానాలుగా ఉన్నాయి. గాంధీనగర్ నుంచి రెండోసారి హోంమంత్రి అమిత్ షా పోటీ చేస్తున్నారు. ఆయనపై కాంగ్రెస్ అభ్యర్థిగా సోనాల్ పటేల్ పోటీలో ఉన్నారు. ఇక, పోర్‌బందర్ నుంచి కేంద్ర ఆరోగ్య మంత్రి మన్‌సుఖ్ మాండవీయ మొదటిసారి పోటీ చేస్తున్నారు. ఆయనపై కాంగ్రెస్ అభ్యర్థిగా లలిత్ వసోయా పోటీ చేస్తున్నారు.

### ఉత్తరప్రదేశ్‌లో మైన్‌పురి, ఫిరోజాబాద్, బదౌన్

ఉత్తరప్రదేశ్‌లోని 13 లోక్‌సభ స్థానాలకు ఈ విడతలో ఎన్నికలు జరుగుతున్నాయి. వీటిల్లో మైన్‌పురి, ఫిరోజాబాద్, బదౌన్‌పై అందరి ఆసక్తి నెలకొన్నది. ములాయం సింగ్ యాదవ్ కుటుంబానికి కంచుకోట లాంటి మైన్‌పురిలో అఖిలేశ్ యాదవ్ భార్య డింపుల్ యాదవ్ పోటీ చేస్తున్నారు. గత పది ఎన్నికల్లో ఇక్కడ వరుసగా సమాజ్‌వాదీ పార్టీ గెలిచింది. ఫిరోజాబాద్, బదౌన్ స్థానాలను గత ఎన్నికల్లో 30 వేల ఓట్ల లోపు తేడాతో కోల్పోయింది. ఈ స్థానాలను తిరిగి కైవసం చేసుకునేందుకు సమాజ్‌వాదీ పార్టీ గట్టిగా ప్రయత్నిస్తున్నది. ఈ రెండు స్థానాల్లోనూ ములాయం కుటుంబసభ్యులే పోటీ చేస్తున్నారు.

### మూడో విడత ప్రచారానికి తెర

11 రాష్ట్రాల్లోని 92 స్థానాలకు రేపు ఎన్నికలు

**అధికార బీజేపీకి అత్యంత ప్రతిష్ఠాత్మకం**

న్యూఢిల్లీ, మే 5: లోక్‌సభ మూడో దశ ఎన్నికల ప్రచారానికి ఆదివారం సాయంత్రంతో తెరపడింది. 11 రాష్ట్రాలు, కేంద్రపాలిత ప్రాంతాల్లోని 92 స్థానాలకు ఈ నెల 7న(మంగళవారం) పోలింగ్ జరుగనున్నది. ఎన్డీయే కూటమికి ప్రతిష్ఠాత్మక రాష్ట్రాలైన, గత ఎన్నికల్లో మెరుగైన ఫలితాలు సాధించిన గుజరాత్, ఛత్తీస్‌గఢ్, బీహార్, మధ్యప్రదేశ్, మహారాష్ట్ర, కర్ణాటక, యూపీ సహా పలు రాష్ట్రాల్లో ఈ మూడో దశ ఎన్నికలు జరుగనున్నాయి. 120 మంది మహిళలతో సహా 1,300 మందికి పైగా అభ్యర్థులు తమ అదృష్టాన్ని పరీక్షించుకొంటున్నారు.

**రాజ్యాంగం, రిజర్వేషన్ల చుట్టూనే ప్రచారం**

ఈ మూడో దశ ఎన్నికల ప్రచారం ప్రధానంగా రిజర్వేషన్ల అంశం, ప్రజ్వల్ సెక్స్ స్కాండెల్ అంశాల చుట్టూనే నడిచింది. ప్రచారంలో అధికార ఎన్డీయే, విపక్ష ఇండియా కూటమి నేతలు ఆయా అంశాలపై ఒకరిపై ఒకరు దుమ్మెత్తిపోసుకొన్నారు. కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వస్తే ఎస్సీ, ఎస్టీ, ఓబీసీల రిజర్వేషన్లను ముస్లింలకు ఇచ్చేస్తుందని ప్రధాని మోదీ సహా ఇతర బీజేపీ నేతలు ఆరోపణలు చేశారు. దీనికి కౌంటర్‌గా.. కాంగ్రెస్, దాని మిత్రపక్ష పార్టీల నేతలు బీజేపీ కేంద్రంలోని వరుసగా మూడోసారి అధికారంలోకి వస్తే రాజ్యాంగాన్నే మార్చేస్తుందని, రిజర్వేషన్లను రద్దు చేస్తుందంటూ ప్రచారం చేశారు.

# పాతాళానికి రూపాయి

## బీజేపీ పాలనలో భారీగా పడిపోయిన కరెన్సీ విలువ

**పదేండ్ల వ్యవధిలో ఏకంగా 43 శాతం వరకూ పతనం • ఆసియా దేశాల్లో ఈ స్థాయిలో మరే కరెన్సీ క్షీణించలేదు..**

స్వాతంత్ర్యం వచ్చినప్పుడు రూపాయి, డాలర్ విలువ సమానం. ఇప్పుడు రూపాయి విలువ ఎలా పతనమవుతున్నదో..చూశారా?
– ప్రధానిగా బాధ్యతలు చేపట్టకముందు జూన్ 14, 2013న నరేంద్రమోదీ అన్న మాటలివి

అవును. మోదీ చెప్పినట్టు అమెరికా డాలర్‌తో రూపాయి మారకం విలువ అధఃపాతాళానికి పడిపోతున్న విధానాన్ని దేశప్రజలందరూ ఇప్పుడు గమనిస్తూనే ఉన్నారు. పదేండ్ల బీజేపీపాలనలో డాలర్‌తో రూపాయి విలువ ఏకంగా 43 శాతం పతనమైంది. ఆసియాలో మరే దేశ కరెన్సీ ఈ స్థాయిలో దిగజారలేదు. రూపాయి విలువ పతనంతో ఎక్కువ మొత్తంలో నష్టపోతున్నది సామాన్యుడే.

(స్పెషల్ టాస్క్ బ్యూరో)

హైదరాబాద్, మే 5 (నమస్తే తెలంగాణ): మోదీ సర్కారు తీసుకొన్న అసమర్థ విధానాలతో డాలరుతో పోలిస్తే రూపాయి విలువ భారీగా పతనం అవుతున్నది. పదేండ్ల వ్యవధిలో భారత కరెన్సీ విలువ ఏకంగా 43 శాతం పతనమైందంటే పరిస్థితి అర్థం చేసుకోవచ్చు. అంతకంతకూ క్షీణిస్తున్న రూపాయి విలువ కారణంగా ప్రస్తుతం దేశానికి కొత్త సవాళ్లు ఎదురవుతున్నాయి. ముఖ్యంగా పేద, మధ్యతరగతి ప్రజల బతుకు ఆగమాగం కానున్నది.

**డాలర్‌తో పోలిస్తే రూపాయి పతనం ఇలా..**




**పెట్రో మంట**

డాలర్‌తో పోల్చితే రూపాయి మారకం విలువ పడిపోతే ముందుగా చమురు ధరలపై ఆ ప్రభావం పడుతుంది. దేశీయ చమురు అవసరాలను 80 శాతం మేర దిగుమతులే సంతృప్తిపరుస్తుండటం దీనికి కారణం. చమురు చెల్లింపులు అంతర్జాతీయ కరెన్సీ అమెరికన్ డాలర్ల ప్రాతిపదికన చేస్తుండటంతో ఎక్కువ మొత్తంలో డాలర్లను ఖర్చు చేయాల్సివస్తుంది. దీంతో ఒకవైపు రిజర్వ్‌బ్యాంక్ వద్దనున్న విదేశీ మారక నిల్వలు కరిగిపోవడంతో పాటు దేశీయంగా పెట్రోల్, డీజిల్ రేట్లు అమాంతం పెరుగొచ్చు. ఇంధన ధరలు పెరిగితే పబ్లిక్ ట్రాన్స్‌పోర్ట్ చార్జీలు పెంచుతారు. దేశీయంగా ఇంధన ధరల పెరుగుదలతో విమాన టికెట్ల రేట్లు కూడా పెరుగుతాయి.

**ధరలు ఆకాశానికి**

ఇంధనం ధరలు పెరుగడం వల్ల రవాణా ఖర్చులు పెరుగుతాయి. దీంతో ఆ ప్రభావం కూరగాయలు, పాలు, పప్పు, ఉప్పు ఇలా మార్కెట్‌లో ప్రతీ వస్తువుపై పడుతుంది. ద్రవ్యోల్బణం కట్టలు తెంచుకొంటుంది. అంతిమంగా నిత్యావసరాల ధరలు ఆకాశాన్నంటుతాయి.

**వడ్డీరేట్లు పెరుగుతయ్**

రూపాయి క్షీణత.. బ్యాంకు రుణాలపై కూడా ప్రభావం చూపిస్తుంది. పెరిగే ద్రవ్యోల్బణాన్ని కట్టడి చేసేందుకు రిజర్వ్ బ్యాంక్ రెపో రేట్లను సవరిస్తుంది. దీంతో గృహ, కారు రుణాలను తీసుకొన్న సామాన్యులపై ఈఎంఐల భారం పెరుగుతుంది.

**మొబైల్స్ పిరం**

మొబైల్ ఫోన్, టీవీ సెట్లు, కంప్యూటర్ల తయారీకి అవసరమైన ఎలక్ట్రానిక్స్ విడిభాగాలు 80 శాతం మేర విదేశాల నుంచే దిగుమతి అవుతున్నాయి. రూపాయి విలువ పడిపోతే వీటి ధరలు కూడా పెరుగుతాయి.

**కరెంటు షాక్**

70 శాతం మేర దేశీయ విద్యుత్తు అవసరాలను బొగ్గు తీరుస్తున్నది. భారత్ పెద్ద యెత్తున విదేశాల నుంచి బొగ్గు, కుకింగ్ కోల్‌ను దిగుమతి చేసుకొంటున్నది. రూపాయి క్షీణతతో ఇది భారంగా మారొచ్చు. ఫలితంగా విద్యుత్తు చార్జీలు కూడా పెరుగొచ్చు.

**విదేశీ చదువులకు కష్టం**

రూపాయి పతనంతో విదేశాల్లో చదువుకునే విద్యార్థుల ఫీజుల కోసం అధికంగా చెల్లించాల్సి రావొచ్చు. వైద్య చికిత్సల కోసం, పర్యటనల కోసం విదేశాలకు వెళ్లే వారి బడ్జెట్ పరిమాణం కూడా అనూహ్యంగా పెరిగిపోతుంది.

**మోదీ హయాంలో రూ.25 డౌన్**

కేంద్రంలో నరేంద్ర మోదీ సర్కారు కొలువుదీరిన దగ్గర్నుంచి రూపాయి మారకం విలువ భారీగా అవిరైపోయింది. 2014లో డాలర్‌తో పోల్చితే రూపాయి మారకం రూ. 58 వద్ద ఉంటే ప్రస్తుతం రూ. 83కు చేరుకొన్నది. దీంతో పదేండ్లలో కరెన్సీ విలువ రూ. 25 మేర పతనమైంది.




### పోలీసుల సమన్లను పట్టించుకోకండి

**రాజ్‌భవన్ ఉద్యోగులకు బెంగాల్ గవర్నర్ ఆదేశం**

కోల్‌కతా, మే 5: బెంగాల్ గవర్నర్ సీవీ ఆనంద్‌పై లైంగిక ఆరోపణల కేసులో మరో ఆసక్తికర పరిణామం చోటు చేసుకుంది. ఈ కేసుకు సంబంధించి పోలీసులు పంపిన సమన్లను పట్టించుకోవద్దంటూ ఆదివారం తమ సిబ్బందిని గవర్నర్ ఆదేశించారు. తనను లైంగికంగా వేధిస్తున్నారంటూ గవర్నర్‌పై రాజ్‌భవన్ ఉద్యోగిని చేసిన ఫిర్యాదుపై కోల్‌కతా పోలీసులు విచారణ బృందాన్ని ఏర్పాటు చేశారు. దీనిపై దర్యాప్తుకు తమ ముందు హాజరు కావాలంటూ నలుగురు రాజ్‌భవన్ ఉద్యోగులకు శనివారం సమన్లు జారీ చేశారు. కాగా అధికరణ 361 (2), (3) ప్రకారం రాజ్యాంగ పదవిలో ఉన్న గవర్నర్‌పై రాష్ట్ర పోలీసులు కేసులు నమోదు, దర్యాప్తు చేయరాదు. దీనినే గవర్నర్ 'ఎక్స్'లో పేర్కొంటూ పోలీసు శాఖకు బంధనాలు వేశారు. రాజ్‌భవన్‌లో సీసీ టీవీ ఫుటేజ్‌ను తమకు అందజేయాలంటూ దర్యాప్తు బృందం రాజ్‌భవన్ అధికారులకు విజ్ఞప్తి చేసింది.

### 2 ఓట్లు.. 2 రేషన్ కార్డులు!

**ఏపీ, ఒడిశా సరిహద్దుల్లో 21 వివాదాస్పద గ్రామాలు**

కొటియా: ఏపీ, ఒడిశాల అసెంబ్లీ ఎన్నికల నేపథ్యంలో 21 గ్రామాలతో కూడిన కొటియా క్లస్టర్ కథ చర్చనీయాంశంగా మారింది. ఏపీ, ఒడిశాల సరిహద్దుల్లో, విశాఖపట్నానికి 150 కిలోమీటర్ల దూరంలోని మారుమూల కొండల్లో బ్రిటీష్ కాలం నుంచి నలుగుతున్న ఈ వివాదాస్పద గ్రామాలు ఉంటాయి. ఇక్కడ అందరికీ రెండు ఓటు కార్డులతోపాటు రెండు రేషన్ కార్డులు కూడా ఉంటాయి. దీంతో వీరికి రెండు ప్రభుత్వాల సంక్షేమ పథకాలు అందుతుంటాయి. ఈ క్లస్టర్ ప్రజలు రెండు రాష్ట్రాల అసెంబ్లీ ఎన్నికలతోపాటుగా, రెండు రాష్ట్రాల పరిధిలోకి లోక్‌సభ ఎన్నికల్లోనూ ఓటు వేస్తారు. ఈ 21 గ్రామాలు ఒడిశాలో కోరాపుట్ లోక్‌సభ, పొత్తంగి అసెంబ్లీ నియోజకవర్గ పరిధిలోకి వస్తాయి. అదేవిధంగా ఇవే గ్రామాలు ఏపీలోని అరకు లోక్‌సభ, సాలూరు అసెంబ్లీ నియోజకవర్గంలోనూ ఉంటాయి. ఇదొక విచిత్రమైన పరిస్థితి అని, తక్షణ పరిష్కారం సాధ్యం కాదని ఎన్నికల అధికారులు అంటున్నారు.

### ప్రజ్వల్‌పై బ్లూ కార్నర్ నోటీస్

బెంగళూరు, మే 5: సెక్స్ స్కాండల్ కేసులో హసన్ ఎంపీ ప్రజ్వల్‌పై బ్లూ కార్నర్ నోటీస్‌ను జారీ చేసినట్టు కర్ణాటక హోం మంత్రి పరమేశ్వర ఆదివారం తెలిపారు. ప్రజ్వల్‌ను స్వదేశానికి రప్పించడానికి ఇంటర్‌పోల్ సాయం తీసుకుంటున్నట్టు చెప్పారు. బ్లూ కార్నర్ నోటీస్ ద్వారా ఒక వ్యక్తి గుర్తింపును, అతడున్న ప్రాంతాన్ని, అతడి కార్యకలాపాలను అంతర్జాతీయ పోలీసుల సాయంతో గుర్తించవచ్చని చెప్పారు.

**రేవణ్ణకు 3 రోజుల సిట్ కస్టడీ**

సెక్స్ స్కాండల్ కేసులో జేడీఎస్ ఎమ్మెల్యే హెచ్‌డీ రేవణ్ణను స్థానిక కోర్టు ఈ నెల 8 వరకు మూడు రోజుల సిట్ కస్టడీకి అప్పగించింది. మైసూర్‌కు చెందిన ఓ మహిళ కిడ్నాపింగ్ కేసులో సిట్ పోటీసులు శనివారం సాయంత్రం రేవణ్ణను ఆయన తండ్రి, మాజీ ప్రధాని దేవెగౌడ నివాసంలో అరెస్టు చేసిన విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలో వైద్య పరీక్షల అనంతరం రేవణ్ణను ఆదివారం సాయంత్రం కోరమంగళలో మేజిస్ట్రేట్ ముందు ప్రవేశపెట్టారు.

# శివమొగ్గలో సూపర్ ఫైట్

- ఇద్దరు మాజీ ముఖ్యమంత్రుల వారసుల నడుమ పోటీ
- బీజేపీ తరపున యెడియూరప్ప కుమారుడు రాఘవేంద్ర
- కాంగ్రెస్ నుంచి బంగారప్ప కూతురు గీతా శివరాజ్‌కుమార్
- బీజేపీ రెబల్‌గా బరిలోకి సీనియర్ నేత కేఎస్ ఈశ్వరప్ప

శివమొగ్గ, మే 5: కూలిన కోటను పునర్నిర్మించుకునే ప్రయత్నం ఒకరిది. కష్టపడి నిర్మించుకున్న కోటను పదిలం చేసుకోవాలనే తపన మరొకరిది. వరుస ఓటములకు ప్రతీకారం తీర్చుకోవాలనే పంతం ఒకరిదైతే.. ఓటమి ఎరుగని నేతగా నిలవాలనే తాపత్రయం మరొకరిది. ఈ హోరాహోరీ పోరుకు వేదికైంది కర్ణాటకలోని శివమొగ్గ లోక్‌సభ స్థానం. ఇక్కడి నుంచి బీజేపీ తరపున మాజీ ముఖ్యమంత్రి యెడియూరప్ప కుమారుడు, సిట్టింగ్ ఎంపీ రాఘవేంద్ర బరిలో ఉండగా, కాంగ్రెస్ తరపున మాజీ ముఖ్యమంత్రి ఎస్ బంగారప్ప కూతురు, కన్నడ హీరో శివ రాజ్‌కుమార్ సతీమణి గీత శివరాజ్‌కుమార్ పోటీ చేస్తున్నారు. బీజేపీ రెబల్ అభ్యర్థిగా ఆ పార్టీ బహిష్కృత నేత, మాజీ డిప్యూటీ సీఎం ఈశ్వరప్ప పోటీ చేస్తున్నారు. శివమొగ్గ స్థానంలో ఈసారి కచ్చితంగా గెలవాలని గీత శివరాజ్‌కుమార్, నాలుగోసారి విజయం సాధించాలని రాఘవేంద్ర గట్టి ప్రయత్నాలు చేస్తున్నారు.

**బంగారప్ప కుటుంబ పంతం**

శివమొగ్గ లోక్‌సభ నియోజకవర్గం 2009కి ముందు వరకు ఎస్ బంగారప్పకు కంచుకోటగా ఉండేది. ఆయన ఇక్కడి నుంచి నాలుగు సార్లు విజయం సాధించారు. అయితే, 2009లో యెడియూరప్ప కుమారుడు రాఘవేంద్ర రంగ ప్రవేశం చేసిన తర్వాత ఈ స్థానం యెడియూరప్ప కుటుంబం వశమైంది. అప్పటి నుంచి వరుస ఎన్నికల్లో బంగారప్ప కుటుంబం ఇక్కడ వరుస ఓటములను చవిచూసింది. నాలుగుసార్లు ఓడిన స్థానంలో ఈసారి కచ్చితంగా గెలిచి పట్టు నిలుపుకోవాలని కాంగ్రెస్ తరపున పోటీ చేస్తున్న గీతా శివరాజ్‌కుమార్ పట్టుదలగా ఉన్నారు.

గీత ఈశ్వరప్ప రాఘవేంద్ర

**కంచుకోటను కాపాడుకునే పనిలో రాఘవేంద్ర**

గతంలో సులువుగానే విజయం సాధించినా ఈసారి మాత్రం విజయం కోసం రాఘవేంద్ర చెమటోడ్చాల్సి వస్తున్నదని రాజకీయ విశ్లేషకులు చెప్తున్నారు. వరుసగా 15 ఏండ్లుగా గెలవడం వల్ల సహజంగా వ్యక్తమయ్యే ప్రజా వ్యతిరేకత, వరుస ఓటముల వల్ల గీతా శివరాజ్‌కుమార్‌పై ప్రజల్లో సానుభూతి రాఘవేంద్రకు మైనస్‌గా మారింది. అయితే, ఇక్కడ పొత్తు వల్ల జేడీఎస్ ఓట్లు కలిసొస్తున్నాయి. కాగా, బీజేపీ రెబల్ అభ్యర్థి, మాజీ ఉప ముఖ్యమంత్రి ఈశ్వరప్ప.. రాఘవేంద్ర ఓట్లు చీల్చే అవకాశం ఉంది. మొత్తంగా శివమొగ్గలో ఈసారి బీజేపీ – కాంగ్రెస్ మధ్య, అంతకంటే ముఖ్యంగా రెండు బలమైన రాజకీయ కుటుంబాల ఆధిపత్య పోరు తీవ్రంగా ఉంది. మే 7న ఇక్కడ ఎన్నికలు జరగనున్నాయి.

### కార్యకర్తపై చేయి చేసుకున్న డీకే

**భుజంపై చెయ్యి వేశాడని చెంపచెళ్లు**

హవేరీ, మే 5: కర్ణాటక డిప్యూటీ సీఎం, రాష్ట్ర పీసీసీ అధ్యక్షుడు డీకే శివకుమార్ సొంత పార్టీ కార్యకర్త ఒకరి చెంప చెళ్లుమనిపించారు. తన భుజంపై చేయి వేశాడన్న కోపంతో విసిగించుకొన్న డీకే.. పార్టీ మున్సిపల్ సభ్యుడిని కొట్టిన వీడియో సోషల్ మీడియాలో వైరల్‌గా మారింది. డీకే శివకుమార్ శనివారం హవేరీ జిల్లాలోని సవనూర్ పట్టణంలో లోక్‌సభ ఎన్నికల ప్రచారంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన వచ్చిన సమయంలో కార్యకర్తలు కొంత మంది నినాదాలు ఇచ్చారు. ఈ క్రమంలో ఒకరు డీకే భుజంపై చేయి వేయగా.. కోపగించుకొన్న శివకుమార్ అతని చెంప చెళ్లుమనిపించాడు. బాధిత కార్యకర్త మున్సిపల్ సభ్యుడు అల్లావుద్దీన్ మనియార్ అని పార్టీ వర్గాలు పేర్కొన్నాయి. మరోవైపు, డీకేపై బీజేపీ తీవ్ర విమర్శలు గుప్పించింది. భుజంపై చేయి వేసిన పాపానికి కార్యకర్తపై డీకే చేయిచేసుకున్నారని, ఆయన ఇలా కార్యకర్తలపై దాడి చేయడం ఇదే తొలిసారి కాదని బీజేపీ ఐటీ సెల్ హెడ్ అమిత్ మాలవీయ పేర్కొన్నారు.

### కాంగ్రెస్‌కు రాధిక ఖేరా రాజీనామా

రాయ్‌పూర్: ఛత్తీస్‌గఢ్ కాంగ్రెస్ నేత రాధిక ఖేరా ఆ పార్టీకి రాజీనామా చేశారు. ఆ పార్టీ జాతీయ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గేకు తన రాజీనామా లేఖను పంపించారు. కాంగ్రెస్‌లో మహిళలకు గౌరవం లేదన్నారు. తాను అయోధ్యలోని రామాలయాన్ని సందర్శించి, బాల రాముని దర్శించుకోకుండా ఉండలేకపోయానని, అందుకే తనపై పార్టీలో విమర్శలు వస్తున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. రాధిక మీడియాతో మాట్లాడుతూ, తాను పార్టీని ఎన్నడూ ధిక్కరించలేదని, పూర్తి అంకితభావంతో, నిజాయితీతో పని చేశానని చెప్పారు. కేవలం తాను అయోధ్యను సందర్శించినందుకు, తాను హిందువును అయినందుకు, సనాతన ధర్మాన్ని అనుసరిస్తున్నందుకు తనకు న్యాయం జరగలేదని ఆరోపించారు. కాంగ్రెస్ పోరాటం శ్రీరామునితోనా? ఏదైనా రాజకీయ పార్టీతోనా? అనే అంశాన్ని తేల్చుకోవాలన్నారు.

### గుజరాత్‌లో ముస్లింలకు 'చెయ్యి'చ్చిన కాంగ్రెస్

అహ్మదాబాద్: లోక్ సభ ఎన్నికల్లో గుజరాత్ నుంచి కనీసం ఒక ముస్లిం అభ్యర్థిని కూడా కాంగ్రెస్ బరిలో నిలపలేదు. భరూచ్ లోక్‌సభ స్థానం నుంచి గతంలో ముస్లిం అభ్యర్థికి అవకాశం ఇస్తూ ఉండేది. ఈసారి ఆమ్ ఆద్మీ పార్టీతో పొత్తు వల్ల ఈ స్థానం ఆ పార్టీకి వెళ్లింది. కాగా, రాష్ట్రం నుంచి మొత్తం 35 మంది ముస్లిం అభ్యర్థులు పోటీ పడుతున్నారు. వీరిలో కొందరు స్వతంత్రులు, మరికొందరు చిన్న పార్టీల టికెట్‌లపై పోటీ చేస్తుండగా, గాంధీ నగర్ స్థానం నుంచి ముస్లిం అభ్యర్థిని బీఎస్‌పీ నిలిపింది.

### వాయుసేన కాన్వాయ్‌పై దాడి బీజేపీ స్టంటే!

న్యూఢిల్లీ : జమ్ముకశ్మీర్‌లో వాయుసేన వాహనశ్రేణిపై శనివారం సాయంత్రం జరిగిన ఉగ్రదాడిపై కాంగ్రెస్ నేత, మాజీ ముఖ్యమంత్రి చరణ్‌జీత్ సింగ్ చన్నీ వివాదాస్పద వ్యాఖ్యలు చేశారు. పూంఛ్ జిల్లా సురన్‌కోట్‌లో జరిగిన ఈ దాడిలో ఓ సైనికుడు మృతిచెందగా, మరో నలుగురు గాయపడ్డారు. అయితే ఇది ఉగ్రదాడి కాదని, లోక్‌సభ ఎన్నికలకు ముందు బీజేపీ చేసిన స్టంట్ అని చన్నీ ఆరోపించారు. ఎన్నికల్లో లబ్ధి పొందేందుకు ప్రజల ప్రాణాలు, దేహాలతో బీజేపీ ఆటలాడుతున్నదని విమర్శించారు.

### తడబడ్డ కంగన.. సొంత పార్టీ నేతపైనే విమర్శలు

న్యూఢిల్లీ: మండీ బీజేపీ ఎంపీ అభ్యర్థి కంగనా తడబడ్డారు. ఆర్జేడీ నేత తేజస్వీ యాదవ్‌పై విమర్శలు చేయబోయి, సొంత పార్టీ నేత తేజస్వీ సూర్యపై విమర్శలు గుప్పించారు. ఇద్దరి పేర్ల ముందు తేజస్వీ ఉండటమే ఆమె గందరగోళానికి కారణం. 'చెడిపోయిన యువరాజుల పార్టీ ఉంది. చంద్రునిపై ఆలుగడ్డలు పండించాలనుకున్న రాహుల్ అయినా, గూండాయిజం చేసి చేపలు తినే తేజస్వీ సూర్య అయినా' అని ఆమె విమర్శలు చేశారు. కంగనా విమర్శలపై తేజస్వీ యాదవ్ 'ఎవరీ మహిళ' అంటూ ట్వీట్ చేశారు.

### 3 పార్టీల నుంచి ముగ్గురు బంధువుల పోటీ

**రసవత్తరంగా ఒడిశాలోని గునుపూర్ అసెంబ్లీ ఎన్నికలు**

కోరాపుట్, మే 5: ఎన్నికల్లో ప్రత్యర్థులను ఓడించడానికి నేతలు ఎత్తులు పైఎత్తులు వేస్తుంటారు. అయితే ఆ ప్రత్యర్థులంతా తన బంధువులే అయితే, వారిలో ఒకరు మనవడు, ఇంకొకకరు మేనల్లుడు అయితే.. ఇదే పరిస్థితి ఎదురైంది ఒడిశాలోని రాయగఢ జిల్లా గునుపూర్ సిట్టింగ్ ఎమ్మెల్యే రఘునాథ్ గమాంగ్‌కు. అధికార బిజూ జనతాదళ్ అభ్యర్థి అయిన రఘున